

పాఠశాలలో జరుగుతున్న మరమ్మతులను పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి


నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 26 మే 2024 | RANGAREDDY


## వార్డుల వారీగా వాతావరణ సమాచారం

**150 డివిజన్ల పటాలను చేర్చిన వాతావరణ శాఖ**

సిటీబ్యూరో, మే 25, (నమస్తే తెలంగాణ) : భారీ వర్షాలను సైతం సమర్థవంతంగా ఎదుర్కొనేలా సరికొత్త కార్యాచరణ ప్రణాళికకు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. వాతావరణ శాఖ సమన్వయంతో జోన్ల వారీగా ఉండే వాతావరణ సమాచారాన్ని డివిజన్ల వారీగా 150 వార్డుల్లో అందజేయనున్నది. రాడార్ వ్యవస్థలో గ్రేటర్‌లోని 150 డివిజన్ల పటాలను చేర్చి సహాయక చర్యలను వేగిరం చేస్తున్నట్లు ఈవీడీఎం అధికారులు తెలిపారు. ప్రస్తుతం బేగంపేట వాతావరణ శాఖ నుంచి మూడు విధాలుగా సమాచారం అందుతున్నది. 250 కిలోమీటర్ల దూరాన్ని అంచనా వేసే రాడార్ ద్వారా రాష్ట్రం మొత్తానికి జిల్లాల వారీగా సమాచారాన్ని చేర్చుతున్నారు. రెండో విధానం వంద కిలోమీటర్ల పరిధి, మూడో విధానం 25 కిలోమీటర్ల మేర పరిధికి సమాచారాన్ని చేర్చుతున్నారు. 25 కిలోమీటర్ల మేర దూరాన్ని పరిశీలించే రాడార్ ద్వారా ఇప్పటి వరకు ఆరు జోన్లు కూకట్‌పల్లి, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి, చార్మినార్, ఎల్బీనగర్, ఖైరతాబాద్‌లతో పాటు మేడ్చల్ జిల్లాలో కొంత భాగం, షాద్‌నగర్ చుట్టు పక్కల ప్రాంతాలకు వాతావరణ సమాచారం అందుతున్నది. వార్డుల వారీగా వచ్చే సమాచారాన్ని ఆయా వార్డు కార్యాలయాల సిబ్బందితో సమన్వయం చేస్తూ డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలను తీసుకోనున్నారు.

### మౌలిక వసతుల కల్పనను

## వేగవంతం చేయాలి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, మే 25 : 'అమ్మ ఆదర్శ పాఠశాల'లో భాగంగా స్కూళ్లలో చేపట్టిన మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. వికారాబాద్ మండల పరిధిలోని కొంపల్లి, రామయ్య గూడ, కొటాల గూడ, కామారెడ్డి గూడ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలపై ఉన్న నమ్మకంతో పాఠశాలల్లో వసతుల కల్పన బాధ్యతలు అప్పగించిందన్నారు. పనులను అంచనాల మేరకు కొన్ని నిధులను ముందుగానే చెల్లించినట్లు తెలిపారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకొని నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యవసరమైన పనులను గుర్తించి వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటి ప్రాధన్యతగా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, తరగతి గదులకు తలుపులు, కిటికీలు, గోడల పగుళ్ల వంటి వాటికి మరమ్మతులు చేయాలన్నారు.

పనులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. పనుల వంటి వాటిని చేపట్టి తీర్చిదిద్దాలని కలెక్టర్ తెలిపారు. కొటాలగూడ పాఠశాలలో పనులు చాలా బాగా జరుగుతున్నాయని అక్కడి వారిని అభినందించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధీర్, మున్సిపల్ కమిషనర్ జకీర్ అహ్మద్, ఎంపీడీవో వినయ్ కుమార్, మండల విద్యాధికారి బాబుసింగ్, ఏపీవో నాగరాజు, కొంపల్లి హెచ్ఎం వెంకట్‌రెడ్డి, కామారెడ్డి హెచ్ఎం మౌనిక, కొటాలగూడ హెచ్ఎం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పెద్దఅంబర్‌పేట, మే 25: ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. పెద్దఅంబర్‌పేట బలిజగూడ రోడ్డులోని సర్వేనంబర్ 169, 170, 183, 149, పెద్దఅంబర్‌పేటలోని సర్వేనంబర్ 272, 273లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శనివారం జేసీబీ సాయంతో కూల్చివేశారు. పసుమాముల గ్రామంలోని సర్వేనంబర్ 454లో రోడ్డుకు అడ్డంగా తీసిన పునాది నిర్మాణాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి కూల్చివేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనుమతుల్లేకుండా చేపట్టిన భారీ అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి, అసలు నోటీసులే ఇవ్వని చిన్న నిర్మాణాలనే కూల్చాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. భారీ అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.





### ఇంకా పాత పింఛన్లే..

# హామీ అమలెప్పుడో..

**ఐదు నెలలైనా నెరవేరని కాంగ్రెస్ ప్రభుత్వ హామీ**



**ఎన్నికల ముందు ఆసరా పింఛన్లను పెంచుతామని ప్రగల్భాలు**

**వృద్ధులు, వితంతువులు తదితరులకిచ్చే రూ.2016 పింఛన్‌ను రూ.4000,**

**దివ్యాంగుల పింఛన్‌ను రూ.6000 పెంచుతామని వెల్లడి**

**పింఛన్ల పెంపుపై ఊసే ఎత్తని సర్కారు**

**ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు**

**కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆలస్యంగా అందుతున్న పింఛన్ డబ్బులు**

వికారాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా పేదలకు ఇచ్చిన హామీలు మాత్రం అమలుకు నోచుకోవడంలేదు. కేవలం ఆరు గ్యారెంటీలకు సంబంధించి ప్రస్తావించడం మినహా మిగతా వాటి ఊసేత్తడం లేదు. ఆసరా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను పెంచుతామని ఇచ్చిన హామీని మర్చిపోయింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి రాగానే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకిచ్చే రూ.2016 పింఛన్ డబ్బులను రూ.4000, దివ్యాంగులకు ఇచ్చే రూ.4016 పింఛన్‌ను రూ.6000 పెంచుతామని చెప్పగా వారి మాటలు నమ్మి ఓటేసి గెలిపించిన ఆసరా పింఛన్‌దారులు పింఛన్ల పెంపు ఎప్పుడో అంటూ ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆరు గ్యా రెంటీలంటూ ప్రచారం చేస్తున్నా వాటి అమలుకు తెల్లరేషన్ కార్డును తప్పనిసరి చేయడంతో పేదలు ఎంతోమంది ఈ పథకాలకు అనర్హులయ్యే ప్రమాదం ఉన్నది. అదేవిధంగా పింఛన్ డబ్బులను పెంచుతామని హామీ ఇచ్చినా ఇంకా పాత పింఛన్లే పంపిణీ చేస్తున్నది. అవికూడా 20 రోజులు ఆలస్యంగా లబ్ధిదారులకు అందు తున్నా యి. అదే బీఆర్ఎస్ హయాంలో ప్రతినెలా 20వ తేదీలోగా ఠంచన్‌గా అందేవి.

### ప్రతినెలా పింఛన్ల పంపిణీలో జాప్యం..

ఆసరా పింఛన్‌తోనే బతుకు బండిని లాగిస్తున్న పండుటాకులు, దివ్యాంగులకు కాం గ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే పింఛన్ల పంపిణీలో జాప్యం చేస్తున్నది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోని లబ్ధిదారు లకు పింఛన్ డబ్బుల పంపిణీ ప్రతినెలా 29 లేదా 30 తేదీన ప్రారంభమై వారం రోజుల్లో పంపిణీని పూర్తి చేస్తుండగా.. కొడంగల్ నియోజకవర్గంలోని లబ్ధిదారులు మాత్రం పింఛన్ డబ్బుల కోసం మొదటి వారం పూర్తయ్యే వరకూ నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొన్నది. బీఆర్ఎస్ హయాంలో ప్రతినెలా 20వ తేదీలోగా లబ్ధిదారులకు అందించగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే పింఛన్ల పంపిణీ ఆలస్యం అవుతుండడంతో పింఛన్‌దారుల్లో అయోమయం నెలకొన్నది. ప్రతినెలా పింఛన్ డబ్బుల కోసం నిరీక్షించాల్సి వస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ప్రతినెలా పింఛన్ డబ్బుల పంపిణీలో జాప్యం జరుగుతుండడంపై జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కొడంగల్ సెగ్మెంట్‌కు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఆసరా పింఛన్ల నిమిత్తం నిధులు మంజూరవుతుండగా.. వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు రంగారెడ్డి జిల్లా నుంచి వస్తున్నాయి. జిల్లాలో 98,793 మంది పింఛన్‌దారులు ఉండగా.. ప్రతి నెలా రూ. 24.38 కోట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది.

### దేశంలో ఎక్కడాలేని విధంగా పింఛన్లు పెంచిన బీఆర్ఎస్..

బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా పథకాన్ని అమల్లోకి తెచ్చి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అండగా నిలవడంతోపాటు దేశంలో ఎక్కడాలేని విధంగా వారికి పింఛన్ డబ్బులను పెంచింది. మొదటిసారి అధికారంలోకి రాగానే వృద్ధులు, వితంతువులు తదితరులకిచ్చే రూ.200 పింఛన్‌ను రూ.1000కి, దివ్యాంగులకు ఇచ్చే రూ.500 పింఛన్‌ను రూ.1500లకు.. రెండోసారి ప్రభుత్వ పగ్గాలు చేపట్టగానే రూ. 1,000 నుంచి రూ.2016, దివ్యాంగుల పింఛన్‌ను రూ.1500ల నుంచి రూ. 30 16కు.. దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు గతేడాది జూన్‌లో దివ్యాంగుల పింఛన్ ను రూ.4016లకు పెంచి పేదల ప్రభుత్వంగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిచింది. జిల్లా లో పింఛన్ల నిమిత్తం రూ.1100 కోట్లకుపైగా ఖర్చు చేసింది. అంతేకాకుండా ఉమ్మడి రాష్ట్రంలో పింఛన్ల నిమిత్తం అప్పటి ప్రభుత్వాలు నెలకు కేవలం రూ.2 కోట్లు ఖర్చు చేయగా...బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతి నెలా రూ.12కోట్ల మేర, రెండోసారి పగ్గాలు చేపట్టగానే పింఛన్ డబ్బులు రెట్టింపు కావడంతో నెలకు రూ.26 కోట్ల మేర ఖర్చు చేసింది.


